ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ సత్యప్రసాద్
- కొనుగోలు కేంద్రాల పరిశీలన

కోరుట్ల రూరల్: ఏకీన్‌పూర్‌లోని కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల రూరల్, మే 3: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. కోరుట్ల పట్టణ పరిధిలోని ఏకీన్‌పూర్ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, ఏమైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ డీఆర్డీవో రఘువరన్, ఆర్డీవో జివాకర్‌రెడ్డి, డీసీవో మనోజ్‌కుమార్, తహసీల్దార్ ఫారుక్, ఆర్ఐ అమర్‌సమద్, రైతులు, తదితరులున్నారు.

ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి

మేడిపల్లి, మే 3: తూకం వేసిన ధాన్యాన్ని 24 గంటల్లోగా రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మేడిపల్లి మండలం వల్లంపల్లి, దమ్మన్నపేట, భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలన్నారు. ధాన్యం తేమ శాతం వివరాలు ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జివాకర్‌రెడ్డి, డీఆర్డీవో రఘువరన్, డీసీవో మనోజ్‌కుమార్, తహసీల్దార్లు వసంత, రవికిరణ్, ఏపీఎంలు గట్ల అశోక్, రత్నాకర్, ఆర్ఐలు ప్రవీణ్, కిరణ్, సీసీలు రాజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ప్రశాంతంగా జరిగేలా చూడాలి

కొడిమ్యాల, మే 3: నాచుపల్లి జేఎన్‌టీయూలో నీట్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. జేఎన్‌టీయూ పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలోని మౌలిక వసతులపై ఆరా తీశారు. అభ్యర్థులకు అసౌకర్యాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు మాట్లాడుతూ, కళాశాలలో మొదటి సెంటర్‌లో 480 మంది, రెండో సెంటర్‌లో 278 మందిని అలాట్‌మెంట్ చేసినట్లు తెలిపారు. 65 మంది ఇన్విజిలేటర్లు, 49 సీసీ కెమోరాలు, 13 సిగ్నల్ జామర్లు ఏర్పాట్లు చేశామన్నారు. జగిత్యాల సిటీ కోఆర్డినేటర్‌గా ప్రభాకర్, చీఫ్ సూపరింటెండెంట్లుగా జగదీశ్‌కుమార్, సురేశ్ శ్రీపాద వ్యవహరిస్తున్నట్లు వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల, మే 3: జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. చిన్నారులు, వృద్ధులకు తాగునీరు, గ్లూకోజ్, ఎలక్ట్రోరల్ పౌడర్ వంటివి అందించాలని సూచించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనులు చేయవద్దని పేర్కొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, మే 3: తాగుడుకు బానిసై.. ఆస్తి తగాదాలతో భార్యను హత్య చేసిన భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హత్య కేసుకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన అవుదుర్తి మహేందర్‌కు కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన మమతతో 20 ఏండ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తలకు సంతానం లేకపోవడంతో మహేందర్ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్యాభర్తలకు తరచూ గొడవలు జరిగేవి. అలాగే, అత్తామామలు వజ్రవ్వ–లక్ష్మణ్, మరుదులు వెంకటేశ్, అనిల్ వేధింపులకు గురి చేయడంతో మమత తన భర్త మహేందర్‌తో కలిసి కరీంనగర్‌లో అద్దెకు ఉంటున్నారు. మమత ఓ షాపింగ్‌మాల్‌లో పని చేస్తుండగా, వస్తున్న జీతం కూడా మహేందర్ తాగుడు ఖర్చు చేస్తుండడంతో వీరిద్దరి మధ్య గొడవ జరుగగా, మమత పుట్టింటికెళ్లింది. తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన పంచాయితీలో ఇక నుంచి మంచిగా చూసుకుంటానని చెప్పి మమతను మహేందర్ కరీంనగర్‌కు తీసుకెళ్లాడు. వేములవాడ, నల్లగొండ ఆలయాల్లో దైవదర్శనం పూర్తి చేసుకొని కొడిమ్యాలకు వచ్చారు. అక్కడ తనకు చాలా అప్పులయ్యాయని.. మెడలో ఉన్న పుస్తెలతాడు ఇవ్వాలని పట్టుబట్టాడు. ఆమె ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో కోపంతో నైలాన్ తాడుతో మమత గొంతునులిమి చంపి, ఫ్యాన్‌కు అదే నైలాన్ తాడుతో ఉరేసుకున్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అనంతరం ఆమె మెడలోని బంగారాన్ని గంగాధరలోని ముత్తూట్ ఫైనాన్‌లో కుదవపెట్టి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై మహేందర్ పారిపోతుండగా, చెప్యాల ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మమత మృతికి కారణమైన ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఇక్కడ మల్యాల సీఐ రవి, ఎస్ఐ సందీప్ తదితరులున్నారు.

పోలీసుల తనిఖీలు

కోరుట్ల, మే 3: కోరుట్లలో శనివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణ సీఐ సురేశ్ బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్, నందిచౌరస్తా జాతీయ రహదారి, కల్లూరు రోడ్డు ప్రాంతంలో నంబర్‌ప్లేట్ లేని ద్విచక్రవాహనాలు, త్రిబుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్, డ్రంకైన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా వాహన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. నంబర్‌ప్లేట్ లేకుండా రహదారులపై తిరుగుతున్న 40వాహనాలను పట్టుకుని సీజ్ చేశారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగిఉండాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐలు శ్రీకాంత్, నవీన్, రాంచంద్రం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడే నీట్

- జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- ఉదయం 11 గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతి • కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, మే 3: జిల్లాలో ఆదివారం నిర్వహించే నీట్‌కు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 768 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లే ముందు బయోమెట్రిక్ అటెండెన్స్, రిజిస్ట్రేషన్, తనిఖీ ప్రక్రియ ఉంటుందని, మధ్యాహ్నం 1:30 గంటల్లోగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అడ్మిట్ కార్డులో పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు మరో ఫొటోను అడ్మిట్ కార్డుకు అతికించాలన్నారు. అదనంగా మరో పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వెంట తెచ్చుకోవాలన్నారు. అప్‌డేటెడ్ ఆధార్ కార్డు తీసుకురావాలని, లేటెస్ట్ ఫొటోతో కూడిన ఐడీ ప్రూఫ్‌ను అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి తీసుకురావాలన్నారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు పెన్నులు, పెన్సిళ్లు తీసుకురావద్దని సూచించారు. పరీక్షా కేంద్రంలోనే పెన్నులు అందజేస్తారని తెలిపారు. సెల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీట్ సజావుగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి, బ్యాంకులకు మరియు ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్‌కి తెలియజేయునది ఏమనగా, శ్రీమతి ముత్త లక్ష్మి, భర్త: తిరుపతి, నివాసం: ఇం.నెం. 2-28, కీమలటపల్లి గ్రామం, పెగడపల్లి మండలం, జగిత్యాల జిల్లా గారు, సర్వే నం. 268/B/7 లో 363 చ.గజముల ఖాళీ స్థలం, ఎల్లాపూర్ గ్రామం, పెగడపల్లి మండలంలో గల దానిని శ్రీ పెద్ది భీరయ్య, తండ్రి: రాజయ్య గారి నుండి రిజిస్టర్ దస్తావేజు నం. 100/2020 ద్వారా కొనుగోలు చేసినారు. లోగడ శ్రీ పెద్ది భీరయ్య గారు పై భూమిని శ్రీ మారుకొండ నారాయణ గారి నుండి రిజిస్టర్ దస్తావేజు నం. 1084/2006, తేది: 31-05-2006 ద్వారా కొనుగోలు చేసినారు.

కానీ పైన తెలిపిన లింక్ ఒరిజినల్ రిజిస్టర్ దస్తావేజు నం. 1084/2006 ప్రయాణంలో పోయినందున, శ్రీమతి ముత్త లక్ష్మి గారు కొత్తపల్లి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసు వారు కనుగునేందుకు ప్రయత్నం చేసినా అట్టి దస్తావేజు దొరకలేదని సర్టిఫికెటు, తేది. 01-05-2025 ద్వారా తెలిపినారు.

శ్రీమతి ముత్త లక్ష్మి గారు, నా క్లయింటు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, నర్సింగాపూర్ బ్రాంచ్ వారిని కలిసి పై ఆస్తిని తనఖా పెట్టి ఋణం తీసుకునేందుకు సంప్రదించారు.

కావున రిజిస్టర్ దస్తావేజు నం. 1084/2006 గురించి కానీ, పై భూమిపై గాని ఎవరికైనా హక్కులు, ఆక్షేపణలు ఉన్నచో ఈ క్రింది చిరునామాలో (7) రోజులలోగా సంప్రదించగలరు. గడువులోగా ఎలాంటి అభ్యంతరాలు రానిచో, నా క్లయింట్ బ్యాంకు, శ్రీమతి ముత్త లక్ష్మి గార్కి ఋణం మంజూరు చేయగలదు. గడువు తదుపరి వచ్చిన ఆక్షేపణలు చెల్లవు.

ఇట్లు: సం/- **లెంకల రాంరెడ్డి,** న్యాయవాది
ఇ.నం. 2-10-327, జ్యోతినగర్, కరీంనగర్.
సెల్: 9440003286.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★KNR తీగలగుట్టపల్లిలో KCR బిల్డింగ్ దగ్గర అయోధ్యనగర్‌లో 50 & 30 ఫీట్ల రోడ్లతో 194 చ.గ.ల టు ఫేసింగ్ ప్లాటు అమ్మబడును.
సెల్: 96183 37209, 76710 65100.
NTK-330283

FINANCIAL SERVICES

★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం, మే 3: మండలంలోని వేములకుర్తి గ్రామంలో మున్నూరుకాపు సంఘ భవనం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం బీఆర్ఎస్ నాయకుడు సున్నం సత్యం, మాజీ ఉపసర్పంచ్ పెద్దరాజం శనివారం ప్రారంభించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలేపు రమేశ్, సున్నం రమేశ్, శంకర్, బోనగిరి రాజిరెడ్డి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి రిఫ్రిజిరేటర్ వితరణ

మెట్‌పల్లి రూరల్, మే 3: మెట్‌పల్లి మండలం వెల్లుల్ల ఆరోగ్య ఉపకేంద్రానికి అమెరికాలోని గ్రేటర్ అట్లాంట తెలంగాణ సొసైటీ(గెట్స్) ఆధ్వర్యంలో సమకూర్చిన రిఫ్రిజిరేటర్‌ను వితరణ చేశారు. గేట్స్ అధ్యక్షుడు బత్తిని నవీన్, చైర్మన్ ఉజ్జిని నవీన్, ఉపాధ్యక్షుడు గండ్ర రమణ, కార్యదర్శి కీర్తిధర్ వితరణ చేసిన రిఫ్రిజిరేటర్‌ను గేట్స్ తరపున బత్తిని శంకర్‌గౌడ్ శనివారం ఏఎన్ఎం భాగ్యలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణ, వైద్యురాలు గజాల ఫిర్దోస్, హెల్త్ అసిస్టెంట్ ప్రభావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

మెట్‌పల్లి రూరల్, మే 3: మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నవీన్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పలు పనుల విషయాల్లో జూనియర్ అసిస్టెంట్ తమను ఇక్కట్లకు గురిచేస్తున్నాడని పంచాయతీ కార్యదర్శులు చేసిన ఫిర్యాదు మేరకు ఇటీవల జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి విచారణ జరిపారు. విచారణ సందర్భంగా జూనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేయాలని కార్యదర్శులు చెప్పడంతో పాటు లిఖితపూర్వకంగా రాసిచ్చారు. దీంతో నవీన్‌ను సస్పెండ్ చేస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కథలాపూర్, మే 3: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన గాజ బ్రహ్మానందస్వామి శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బ్రహ్మానందస్వామి పార్థివ దేహంపై శనివారం వీప్ ఆది శ్రీనివాస్ పూలమాల ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, తదితరులున్నారు.

రేపు పెగడపల్లి మండలంలో మంత్రి పర్యటన

పెగడపల్లి, మే 3: పెగడపల్లి మండలంలో ఈనెల 5న పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పర్యటిస్తారని వీప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కీచులాటపల్లి నుంచి ధర్మారం మండలం మల్లాపూర్ వరకు సీఆర్ఆర్ నిధులు రూ.8.20 కోట్లతో చేపట్టే రోడ్డు నిర్మాణ పనులను మంత్రి సీతక్క ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కాగా, శనివారం రాత్రి కీచులాటపల్లిలో మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను వీప్ లక్ష్మణ్‌కుమార్ పీఆర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ లక్ష్మణ్‌రావు, డీఈ అశ్విన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సత్కారం

కోరుట్ల, మే 3: పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం స్వేచ్ఛ సాహిత్య సేవా సంస్థ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రాస భూమయ్య, ప్రధాన కార్యదర్శి రుద్ర నాగరాజు, సహాయ కార్యదర్శి ఒటారికారి శ్రీనివాస్, సభ్యులు శ్యాం సుందర్, గౌతమ్, రాజశేఖర్, నాయకులు విశ్వనాథం, భాస్కర్, నగేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోరుట్ల/కోరుట్ల రూరల్, మే 3: కోరుట్ల పట్టణ పరిధిలోని ఏకీన్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాల 2005–06 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను ఆహ్వానించి సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల, మే 3: పట్టణంలోని బెండపల్లి, ఇందిరారోడ్డు, టీచర్స్ క్లబ్ ఏరియా, అర్పత్ పురా కాలనీ, కాల్వ గడ్డ, శ్రీనివాస రోడ్డు, జవహర్ రోడ్డు, కటికెవాడ, ఆనంద్‌నగర్, నక్కలగుట్ట, కల్లూరు రోడ్డు, ఝాన్సీ రోడ్డు, లక్ష్మీ థియేటర్, త్రిశక్తి ఆలయం, పాత మున్సిపల్ ఏరియాలకు ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుట్ల, మే 3: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు తిరుమల గంగాధర్ పాల్గొన్నారు.

అధ్యాపకుల ప్రచారం

సారంగాపూర్, మే 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శనివారం పెంబట్ల, కోనాపూర్ గ్రామాల్లో పదో తరగతి పూర్తయిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి కళాశాలలో కోర్సులు, సదుపాయాల గురించి వివరించారు. ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో రెండో స్థానం, రాష్ట్ర స్థాయిలో 5వ స్థానం నిలిచినట్లు తెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని, మెరుగైన విద్యాబోధన చేస్తారని చెప్పారు. తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను కళాశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, అధ్యాపకులు శ్రీధర్, రాజు, వెంకటేశ్వర్లు, సంపత్ రావు, జ్యోతిరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

సారంగాపూర్, మే 3: తెలంగాణ విద్య, వైద్యంలో దేశానికే దిక్సూచిగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. బీర్‌పూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు కే అమూల్య 580, అశ్విత 561, శ్రీహిత 551 మార్కులు సాధించగా, శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంగనబట్ల నర్సింహ మూర్తి, మాజీ ఎంపీటీసీ సృజనసుశిన్, మాజీ ఉప సర్పంచ్ హరీశ్, ఉపాధ్యాయులు ధరణి, రఘుపతి, మంజునాథ్, ప్రజుల, గౌతమి, గంగారం, మంగ, ఉమ పాల్గొన్నారు. అలాగే, సారంగాపూర్ తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వహీదొద్దీన్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటేశ్, తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు వినతి

జగిత్యాల, మే 3: జిల్లా కేంద్రంలోని కోర్టును బార్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కోర్టులో అవసరమైన మౌలిక సదుపాయాలు, నూతన కోర్టు, కోర్టుహాల్, నూతన పోస్టులు, అడ్వకేట్ల సమస్యలు, తదితర విషయాలు ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి అందె మారుతి, ఉపాధ్యక్షుడు మహేందర్, సీనియర్ న్యాయవాదులు జనార్దన్ రెడ్డి, బండ భాస్కర్ రెడ్డి, కొలుగూరి దామోదర రావు, నరేందర్, మదన్‌మోహన్, ఎర్ర నర్సయ్య, లక్ష్మీనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే, జగిత్యాలలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, అర్హుల జాబితా, లబ్ధిదారుల సమస్యలు, తదితర అంశాలపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు అందించే బాధ్యత అధికారులదేనని, ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ప్రత్యక్షంగా లబ్ధిదారుల గృహ నిర్మాణ పరిశీలన చేయాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలని, ఆ దిశగా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో మదన్‌మోహన్, కమిషనర్లు స్పందన, మనోహర్, ఎంపీడీవోలు, హౌసింగ్ డీఈ ప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

జగిత్యాల రూరల్, మే 3: జగిత్యాల రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ. 15 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పనులను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా నరేశ్

జగిత్యాల రూరల్, మే 3: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన పట్నం నరేశ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో లాతోపాటు ఎల్ఎల్ఎం పూర్తి చేశాడు. ఇటీవల ప్రకటించిన జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన పట్నం మహేందర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంపై గ్రామస్తులు, మిత్రులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

స్వగ్రామానికి గల్ఫ్ బాధితుడి మృతదేహం

మేడిపల్లి, మే 3: మేడిపల్లి మండలం తొంబర్‌రావుపేట గ్రామానికి చెందిన గడ్డం నర్సారెడ్డి (53) సౌదీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, దవాఖానలో చికిత్స పొందుతూ ఈ నెల 6న మృతి చెందాడు. నర్సారెడ్డి మృతదేహం శనివారం స్వగ్రామానికి రాగా కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కథలాపూర్, మే 3: మండల కేంద్రంలో పారిశుధ్య పనులను ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, ఎంపీడీవో శంకర్ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజశేఖర్, ఏఈ జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

మెట్‌పల్లి, మే 3: వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కోరారు. 15 రోజుల పాటు జరిగే శిక్షణ తరగతుల్లో ఆంగ్లం, చిత్రలేఖనం, క్రీడలు, కుట్లు, అల్లికలు, పాలిగ్రఫీ వంటి వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు పెన్ను, నోట్‌పుస్తకంతో పాటు స్నాక్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే, మెట్‌పల్లి మండలం వెల్లుల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 7 నుంచి 10 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 7 నుంచి 8 గంటల వరకు బాలికలకు క్రికెట్, బాలురకు ఖోఖో క్రీడల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణ, రామేశ్వర్, ఆగమయ్య, సురేశ్, బత్తుల శివప్రసాద్, మల్లేశం, రమాకాంత్, జ్ఞానేశ్వర్, గణేశ్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్, మే 3: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వమించే యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్‌లను ప్రభుత్వ పాఠశాల వి